# సొమ్మొకడిది - సౌండొకడిది

సింహాచలం గారి గుండె ఆగిపోయి ఇక్కడ ఆయువు చెల్లిపోయాయి అంటే— చెక్క సున్నం సింహాచలం అనబడే పెద కంట్రాక్టర్‌గారు కోట్లకి విలువ చేసే కంట్రాక్టులు చేసి అటు దేశానికి, ఇటు అనేకమంది ప్రజలకు జీవనోపాధి చూపించి సేవ చెయ్యడమేకాక, స్నేహశీలిగా, సహృదయునిగా, దయామయునిగా పేరుగాంచి, తన ముగ్గురు భార్యలను, పదముగ్గురు పిల్లలను, పంధొమ్మిదిమంది మనవలను, అనేకమంది అధికారవర్గపు స్నేహితులను, పెక్కుమంది రాజకీయ హితులను, మిగిలిన బంధుకోటిని ఇతర ప్రజలను విచార సాగరంలో ముంచి కన్నుమూశారు.

ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు అత్యంత వైభవంగా ఏర్పాటు చెయ్యబడ్డాయి. ప్రముఖులంతా ఆయన




చనిపోవడం వలన కలిగిన లోటును భర్తీ చెయ్యడం కష్టమనిన్నూ, దేశానికి తీరని నష్టమనిన్నూ సందేశాలు పంపించారు.

కీర్తిశేషులు సింహాచలం చిన్నతనంలో పల్లె నుంచి ఆ పట్నం చేరుకుని రెండెడ్ల బండి తోలుతూ చెక్క సున్నం గానుగ దగ్గర పని చెయ్యడం ప్రారంభించారు. కష్టపడి క్రమంగా ఆ బండిని తానే కొనేశాడు. కొన్నాళ్ళకి సదరు గానుగకి కూడా తానే యజమాని అయ్యాడు. అక్కడ పని చేస్తున్న ఆడకూలి పైడితల్లిని ప్రేమించి గాంధర్వ విధిని వివాహం కూడా చేసేసుకున్నాడు.

చిన్న చిన్న కాంట్రాక్టులు ప్రారంభించాడు. అయిన పన్లు, కానిపన్లు అన్నీ ఒప్పుకొని వ్యాపారాన్ని పెంచుకున్నాడు. వీలైనన్ని వ్యాపారాలు ప్రారంభించాడు. వీలైన వాటన్నిట్లో పెట్టుబడి పెట్టాడు. సారాపాట కూడా పాడాడు. లారీలు, బస్సులు కొన్నాడు. సిటీ బస్సులు కూడా నడిపాడు. అన్ని వ్యాపారాలు తానే స్వయంగా నిర్వహించడం కష్టమని భావించి నమ్మకమైనవాళ్ళు మళ్ళీ ఎక్కడ దొరుకుతారని మరో ఇద్దరు భార్యల్నికూడా చేపట్టాడు.

భార్యలు ఐకమత్యంతో అతని ఐశ్వర్యాన్ని, సంతతిని వీలైనంత త్వరలో పెంపొందించారు. పలిముద్ర వేసినా వేలకి వేలు విలువైన కంట్రాక్టులే కాకుండా కోర్టుమీద వ్యవహారాలుకూడా చాలా నిర్వహించి ఆ వూళ్ళో, ఆ తాలూకాలో, ఆ జిల్లాలో చివరికి రాష్ట్రంలో ముఖ్యమైన పెద్దమనిషిగా ప్రఖ్యాతి గాంచాడు. కోట్లకి పడగెత్తినా ఆయన ఏనాడు కూడా రెండు విషయాల జోలికి వెళ్ళలేదు వ్యభిచారం, రాజకీయాలు అనే రెండు ప్రమాదాలు తన ఛాయలకి రాకుండా జాగ్రత్తగా కాపాడుకుంటూ జీవనయాత్ర సాగించిన చెక్క సున్నం సింహాచలం అంతిమ యాత్రని అంత అపురూపంగా జరుపుకోవాలని ప్రజలంతా అందుకే అనుకున్నారు.



బాజాలు, భజంత్రీలు, బాణాసంచాలు, తాళాలు, మేళాలు, లారీలు, బస్సులతో ప్రజలు, నాయకులు, మంత్రులు, సినిమా తారలు తమ శ్రద్ధాంజలి ఘటించడానికి తండోపతండాలుగా తరలి వచ్చారు. ఆయన అంతిమయాత్ర ఆరంభమైంది. నాలుగు వీధులు తిరిగి వూరేగింపు ఆస్పత్రి దగ్గరకి వచ్చి ఆగిపోయింది.

ఆస్పత్రి ముందు ఏ విధమైన చప్పుళ్ల చెయ్యకూడదని, లోపల రోగులకు ఏ విధమైన ఇబ్బంది కల్గించకూడదని, కాబట్టి ఆ మేళ తాళాలు, బాజా భజంత్రీలు బాణా సంచా ఆపమని ఆస్పత్రి అధికారులు అభ్యంతరం తెలిపారు.

కీ॥ శే॥ చె॥ సింహాచలంగారి ఆత్మశాంతి కోసం ఆ కొంతదూరం నిశ్శబ్దంగా వెళ్దామని ప్రజలు, నాయకులు భావించినా సింహాచలంగారి మూడవ భార్య శ్రీమతి నూకరత్నం అందుకు వొప్పుకోలేదు.

"చప్పుడు వింటేనే చచ్చిపోయే రోగులు బతికి మాత్రం ఏం లాభం? చప్పుడు లేకుండా వుండాలంటే ఆస్పత్రి అడివిలో కటుకోక పోయారా! వూరి మధ్యలో ఆస్పత్రి పెట్టి వుస్సు వుస్సు అంటే వూరుకుంటామా" అని శ్రీమతి నూకరత్నంగారు శోకిస్తూ వాదించారు. ఆస్పత్రి అధికారులుససేమిరా అన్నారు. అయినా "వీల్లేదు వాయించండి బాజాలు" అన్నారు శ్రీమతి నూకరత్నంగారు.

పోలీసుల జోక్యం వల్ల బాజాలు, భజంత్రీలు, బాణాసంచా ఆపక తప్పలేదు. వూరేగింపు నిశ్శబ్దంగా నడవక తప్పలేదు. కానీ శ్రీమతి నూకరత్నంగారు గట్టిగా ఏడుస్తూ ఆస్పత్రి అధికారుల్ని నానా శాపనార్థాలు పెడుతూ వీలైనంత శబ్దాన్ని సృష్టించినా ఆమె కసి తీరలేదు. దుఃఖం ఆగలేదు.

తన భర్త అంతిమయాత్రని నిశ్శబ్దంగా చేసిన ఆస్పత్రి ఆమె కళ్ళముందు కదులాడసాగింది. కొన్నాళ్ళకి ఆమె భర్తని మర్చిపోగల్గినా ఆస్పత్రిని మాత్రం మరవలేకపోయింది. ఆస్పత్రి ముందు ప్రతీ రోజూ నానా రకాల శబ్దాలతో హోరెత్తిపోయే మార్గం కోసం ఆమె అన్వేషించ సాగింది.

ఆమె ఆలోచనలు ఫలించి ఆస్పత్రి ఎదురుగా సినిమాహాలు నిర్మించే పథకాన్ని ఆమె చేపట్టింది. ఆస్పత్రి ఎదురుగా సినిమాహాలు కట్టడానికి అనుమతి లభించలేదు. కలక్టర్‌గారు కాదన్నారు. మంత్రిగారు చెప్పడానికి మొహమాటపడ్డారు. ఇద్దరికీ బదిలీ అయిపోయింది. శబ్దంలేని సినిమాలే ఆడతామని ఆస్పత్రి ముందు అంతా స్మశానంలా నిశ్శబ్దంగానే వుంటుందని హామీ ఇచ్చిన పిమ్మట పర్మిషన్ లభించింది.

పురాతన మూకీ సినిమాలు ఆడడంవల్ల ఆ సినిమాలు ప్రస్తుత సినిమాలకంటే వుత్తమంగా వుండడంవల్ల ప్రజలు వెర్రెత్తి విరగబడిపోయారు. కార్లు, రిక్షాలు, బస్సులు, సైకిళ్ళు, జనం, ఆస్పత్రి హోరెత్తిపోసాగింది.

వుద్యమాలులేని నాయకులు కొందరు ఆస్పత్రి ముందు సినిమాహాలు వుండరాదని ఉద్యమం ప్రారంభించారు.

నిరవధిక నిరాహారదీక్ష కూడా ప్రారంభించారు. ఆస్పత్రి ఎదురుగా సినిమాహాలు వుండరాదని అధికారులు నిర్ణయించక తప్పలేదు.

పర్యవసానంగా సదరు ఆస్పత్రిని అక్కడనుంచి మరొకచోటికి తరలించడం జరిగింది.

[నీతి :– సినిమాహాలు ముందు ఆస్పత్రులు వుండరాదు]

—తంబు